ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్

నర్సంపేటరూరల్: ఇటుకాలపల్లిలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్

నర్సంపేటరూరల్/గీసుగొండ, ఆగస్టు 16: ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సంపేట ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో ఇటుకాలపల్లిలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ప్రకాశ్ వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు కె.సుస్మిత, ప్రశాంతి, సురేశ్‌నాయక్, జ్యోతి, దివ్వరావు, సౌమ్య, రాజన్న, మహేందర్‌రెడ్డి, స్వర్ణలత, రాజేందర్, జయరాజు, రామరాజు, రామలింగం, సంజీవ, మల్లారెడ్డి, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు. గీసుగొండ మండలంలోని మచ్చాపురం, ఊకల్‌లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలు సేకరించామని వైద్యాధికారి దేవేందర్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి, ఏఎన్ఎంలు సదాలక్ష్మి, సుహాసిని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యుల సంక్షేమానికి తోడ్పాటు

చెక్కు అందజేస్తున్న గుండా ప్రకాశ్‌రావు

గిర్మాజీపేట, ఆగస్టు 16: ఆర్య వైశ్యుల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తానని మాజీ మేయర్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు అన్నారు. ఎస్వీఎన్‌రోడ్‌లోని సంఘం కార్యాలయ ఆవరణలో పలు పథకాల లబ్ధిదారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. కుటుంబ భద్రత పథకంలో లబ్ధిదారులైన మేకటి సదానందం కుటుంబ సభ్యులకు రూ.50వేల చెక్కు, ఆరోగ్య ప్రాప్తిరస్తు పథకం ద్వారా అర్హులైన రెండు కుటుంబాలకు రూ.10వేల చొప్పున, అంతిమ సంస్కారం పథకం ద్వారా కరీమాబాద్ నివాసి బెజగం సత్యనారాయణ కుటుంబానికి రూ. 5 వేలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనుపునూరి వీరన్న, పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మాదారపు రాజేశ్వరరావు, ఐత ప్రసాద్, గుండా ముక్తేశ్వర్, కల్వ నాగరాజు, చందుపట్ల మార్కండేయ, గుండా మల్లికార్జున్, శివప్రసాద్, కార్యాలయ సిబ్బంది అజయ్, లావణ్య, శ్రీలత, రమాదేవి, మంజుల పాల్గొన్నారు.

నెక్కొండ పీహెచ్‌సీ తనిఖీ

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సంధ్యారాణి

నెక్కొండ, ఆగస్టు 16: నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని వైద్యాధికారి రహెలా తన్వీర్‌కు సూచించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించడంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

పోకల శైలజకు డాక్టరేట్

డాక్టర్ శైలజ

ఖిలావరంగల్, ఆగస్టు 16: వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ పోకల శైలజకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ డాక్టర్ ఏ అరుణకుమారి తెలిపారు. 'నావెల్ సెక్యూర్ మల్టీ పాత్‌రోటింగ్ అల్గారితం ఫర్ మొబైల్ అడహక్ నెట్వర్క్' అంశంపై ప్రొఫెసర్ గురురావు పర్యవేక్షణలో ఆమె తన పరిశోధన పూర్తి చేశారు. 20 ఏళ్లుగా ఇంజినీరింగ్ విద్యార్థులకు బోధిస్తూ పలు పరిశోధనా పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రకాశ్, సెక్రటరీ దేవేందర్‌రెడ్డి శైలజను అభినందించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- రిజిస్ట్రేషన్ లేకుంటే దవాఖానలను సీజ్ చేస్తాం
- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఉపేక్షించం
- తప్పనిసరిగా ల్యాబ్‌లు, క్లినిక్‌లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- ఫీజుల వివరాలు బోర్డుపై నమోదు చేయాలి
- సమీక్షలో కలెక్టర్ సత్య శారద

మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, ఆగస్టు 16: ప్రభుత్వ నిబంధనలు పాటించని దవాఖానలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ సత్య శారద హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె జిల్లాస్థాయి ప్రైవేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, డెంగ్యూ కేసుల నివారణపై సమీక్షించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రైవేట్ క్లినిక్‌లు, పాలి క్లినిక్‌లు, దవాఖానలు విధిగా నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. జిల్లాలోని అన్ని క్లినిక్‌లు, పాలి క్లినిక్‌లు, ల్యాబ్‌లు, హాస్పిటళ్లు, వెల్‌నెస్ సెంటర్లు, ఫిజియోథరపీ సెంటర్లు, ఐ క్లినిక్‌లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ఆయుర్వేద, యునాని, హోమియో, సిద్ధ, యోగ, నేచురోపతి వంటి అన్ని వైద్యశాలలు, క్లినిక్‌లు కూడా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ఆస్పత్రులకు జరిమానా లేదా సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఎంపీ, పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవద్దన్నారు. కేవలం ప్రథమ చికిత్స చేయాలన్నారు. ఇంజిక్షన్లు వేయొద్దని, సెలైన్లు పెట్టకూడదని, అల్లోపతి వైద్యం చేయొద్దని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌ల్లో ఆయుష్ వైద్యులను డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా లేదా వైద్యం చేసేందుకు అనుమతిస్తే ఆయా దవాఖానలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎఫ్‌జీఎంఈ పరీక్ష తర్వాతే వైద్యం..

విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన డాక్టర్లు తప్పనిసరిగా ఎఫ్‌ఎంజీఈ పరీక్షలో ఉత్తీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొన్న తర్వాతే ప్రాక్టీస్ లేదా దవాఖానలో పని చేయాలని సూచించారు. చాలామంది ఎఫ్‌జీఎంఈ పరీక్ష పాస్ కాకుండానే హాస్పిటళ్లలో పని చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగుల నుంచి తీసుకుంటున్న ఫీజులు, చార్జీల వివరాలను దవాఖానలు, క్లినిక్‌ల నిర్వాహకులు రిసిప్షన్‌లో తెలుగు, ఇంగ్లిష్ భాషలో బోర్డులు ఏర్పాటు చేయించాలన్నారు. బోర్డుపై ఉన్న చార్జీల మేరకు రోగుల నుంచి ఫీజు వసూలు చేయాలన్నారు. విధిగా దవాఖానల్లో పరిశుభ్రత పాటించాలని, సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే, ఇన్‌స్టిట్యూట్స్‌లో పని చేసే వైద్యులు, వారి రిజిస్ట్రేషన్ నంబర్లు, విద్యార్హత కూడా రిసిప్షన్ వద్ద అందరికీ కనిపించేలా డిసిప్లే చేయాలన్నారు. రాష్ట్రంలో ఆపరేషన్ల రేట్ ఎక్కువగా ఉన్నందున విధిగా ఇండికేషన్ ఉన్న కేసులకు మాత్రమే సీ-సెక్షన్ ప్రసవాలు చేయాలన్నారు. ఎంపీటీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే నిబంధనలకు లోబడి ఇద్దరు డాక్టర్ల సమక్షంలోనే అబార్షన్ చేయాలన్నారు. ప్రతి నెల అబార్షన్ వివరాలను డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందించాలన్నారు. సరోగసీ లెవల్ 1, 2 రిజిస్ట్రేషన్ ఉన్న వారు మాత్రమే ఐవీఎఫ్ సెంటర్లు నిర్వహించేందుకు అర్హులన్నారు. మలేరియా, డెంగ్యూ, హెచ్ఐవీ వంటి వ్యాధులు సోకిన వారి వివరాలను ప్రతి నెల ఆరోగ్య శాఖ కార్యాలయంలో తెలపాలని సూచించారు. సమీక్షలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె. వెంకటరమణ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి ఘటనను నిరసిస్తూ జూడాలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ సత్య శారదను కలిసి వినతిపత్రం అందజేశారు.

వడ్లకొండలో వీధులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పర్వతగిరి, ఆగస్టు 16: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన వడ్లకొండలో డ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా వీధుల్లో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో సుశీల్‌కుమార్, జీపీ కార్యదర్శి సునీల్, ఈసీ రాజర, ఆశ కార్యకర్త వల్లందాసు లక్ష్మి పాల్గొన్నారు.

'మహిళలకు రక్షణ కల్పించకపోవడం సిగ్గుచేటు'

నర్సంపేట, ఆగస్టు 16: స్వాతంత్ర్య భారతదేశంలో నేటికీ మహిళలకు రక్షణ కల్పించకపోవడం సిగ్గుచేటని ఏఐఎఫ్‌డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగల రాగసుధ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి చేసి హత్య చేసిన ఘటన మహిళా లోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. బాధ్యులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. డివిజన్ నాయకులు గణిపాక బిందు, జ్యోతి, అచల, స్వరూప, నిర్మల, సుభద్ర, లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సీకేఎం హాస్పిటల్‌లో వైద్య సిబ్బంది నిరసన

నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ ఆఫీసర్లు, ఉద్యోగులు, సిబ్బంది

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 16: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి, హత్య ఘటన, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైద్యులు, మెడికోలపై అల్లరిమూకల దాడి మరువకముందే.. ఉత్తరప్రదేశ్‌లో నర్సింగ్ ఆఫీసర్‌పై లైంగిక దాడి జరగడం దారుణమని వరంగల్ సీకేఎం హాస్పిటల్ నర్సింగ్ ఆఫీసర్లు, జూనియర్ డాక్టర్లు అన్నారు. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో వైద్యులపై దాడులు, హత్యలు జరుగుతున్నా స్పందించని అక్కడి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సీకేఎం హాస్పిటల్‌లో వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో శుక్రవారం నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ఓ మహిళ సీఎం గా, హోంమంత్రిగా ఉన్నప్పటికీ మహిళా వైద్యులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వైద్యులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆయుర్వేద వైద్య విద్యార్థుల నిరసన

కాశీబుగ్గ: కోల్‌కతాలో పీజీ వైద్యురాలి హత్యను నిరసిస్తూ లేబర్‌కాలనీలోని ప్రభుత్వ అనంతలక్ష్మి ఆయుర్వేద వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులు నిరసన తెలిపారు. వైద్య విద్యార్థులు ప్లకార్డులు చేతబూని నిందుతుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులను దూషించిన అధికారికి మెమో జారీ?

ఖిలావరంగల్, ఆగస్టు 16: ఖుష్‌మహల్ ప్రాంగణంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మహిళా ఉద్యోగులను దూషించిన వారికి కలెక్టర్ మెమో జారీ చేసినట్లు తెలిసింది. ఉత్తమ ఉద్యోగుల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ మహిళా ఉద్యోగులపై సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి అసభ్య పదజాలంతో దూషించిన అంశంపై శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురించింది. అలాగే, 129 పేర్లతో కూడిన ఉత్తమ ఉద్యోగుల జాబితాను పౌర సంబంధాల శాఖ బుధవారం అర్ధరాత్రి ప్రకటించింది. పంద్రాగస్టు వేడుకల్లో జాబితాలో లేని మరో 20 మందికిపైగా అవార్డులు అందుకోవడంపై పత్రికలో వెలువడింది. అంతేకాకుండా ముఖ్య అతిథి మాట్లాడే స్క్రిప్ట్ ప్రతులు కూడా రెండు రకాలుగా ముద్రించడం, ఉత్తమ ఉద్యోగుల జాబితాను వేడుకల ప్రాంగణంలో పంపిణీ చేయకపోవడంతో పాటు మహిళా సిబ్బందిపై అసభ్య పదజాలంతో దూషించినందుకు కలెక్టర్ సంబంధిత అధికారులకు మెమో జారీ చేసినట్లు తెలిసింది. 24 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని కోరినట్లు ప్రచారం జరుగుతోంది.

చేనేత, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

పోచమ్మమైదాన్, ఆగస్టు 16: తెలంగాణకు నూతనంగా మంజూరైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) హైదరాబాద్‌లోని చేనేత, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2024-2025 విద్యా సంవత్సరానికి మూడేళ్ల కోర్సుల్లో భాగంగా 60 సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థులు పదో తరగతి లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులై, 2024 జూలై ఒకటి నాటికి బీసీ, జనరల్ కేటగిరీకి చెందిన 23 ఏళ్ల వయస్సు, ఎస్సీ, ఎస్టీ వారికి 25 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు tsht.telangaga.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రాణాలు కాపాడిన డయల్ 100


బ్రహ్మంను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

గిర్మాజీపేట, ఆగస్టు 16: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ప్రాణాలను డయల్ 100 కాపాడింది. ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా చింతపాలెం మండలం నక్కగూడెంతండాకు చెందిన గుగులోత్ బ్రహ్మం కేయూలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం బ్రహ్మం వరంగల్ రైల్వేస్టేషన్ చేరుకొని తనకు బతకడం ఇష్టం లేదని ఊరిలో ఉన్న తన బాబాయ్ లాలుకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే లాలు డయల్ 100 ద్వారా ఇంతెజార్‌గంజ్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే సీఐ, బ్లూకోల్ట్ సిబ్బంది కుమార్ స్పందించి రైల్వేస్టేషన్‌కు చేరుకొని బ్రహ్మంను గుర్తించారు. అనంతరం అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


వరి పంటను పరిశీలిస్తున్న ఉషాదయాళ్

నల్లబెల్లి, ఆగస్టు 16: పంటల సాగులో అన్నదాతలు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ సూచించారు. గోవిందాపూర్, కొండాపూర్, శనిగరంలో శుక్రవారం ఆమె పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరి, మక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ప్రతి రైతు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధిస్తారన్నారు. ఆమె వెంట అధికారులు సారంగం, భాస్కర్ పాల్గొన్నారు.

పీడీ కొమ్ము రాజేందర్‌కు సన్మానం

రాజేందర్‌ను సన్మానిస్తున్న డాక్టర్ గోపాల్

నర్సంపేట, ఆగస్టు 16: పట్టణంలోని షటిల్ ప్లేగ్రౌండ్ ప్రాంగణంలో నర్సంపేట డివిజన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో పారిస్‌లో జరిగే పారా ఒలంపిక్ క్రీడలకు టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపికైన కొమ్ము రాజేందర్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మణాచారి, శ్రీనివాస్, జాతీయ క్రీడాకారుడు హర్జియా, సునీల్, రాజు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు

- నెర్రెలు వారుతున్న వరి పొలాలు
- సాగు నీటి కోసం తండ్లాట
- దిక్కుదోచని స్థితిలో అన్నదాతలు

నీరు లేక ఎండి పోతున్న వరి పొలం

చెన్నారావుపేట, ఆగస్టు 16 : సాగునీరు అందక కళ్లెదుటే పంట పొలాలు ఎండిపోతుంటే ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. మండలంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి. దీంతో ఉన్న కొద్దిపాటి నీళ్లతో రైతులు నాట్లు వేశారు. ఈ క్రమంలో వర్షాలు ముఖం చాటేయడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించిన మరికొంతమంది రైతులు దున్నిన పొలాలను నాట్లు వేయకుండానే వదిలేశారు. నర్సంపేట డివిజన్‌లో పాకాల తర్వాత రెండో అతి పెద్ద చెరువు కోపాకుల. ఈ చెరువు కింద సుమారు 900 ఎకరాల ఆయకట్టు ఏటా సాగవుతుంది. ఈ వానకాలంలో ఇప్పటి వరకు 500 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేసి నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. మరో 400 ఎకరాలను వదిలేశారు. ఇప్పటికే ఒక్కో ఎకరానికి రూ. 15 వేల పెట్టుబడి అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట ఎండిపోతే తాము తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు. ఇటీవల వర్షాలకు చెరువులోకి ఐదు ఫీట్ల నీరు చేరగా, పశువుల కోసం నీళ్లు ఉండాలని రెవెన్యూ అధికారులు విడుదల చేయడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఫణికుమార్‌ను వివరణ కోరగా, ఇంతవరకు తమ దృష్టికి రాలేదని, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సాగునీరు అందేలా చూస్తామన్నారు.

కోటలో రోడ్డు చుట్టూ ముళ్ల పొదలు

సీసీ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు

ఖిలావరంగల్, ఆగస్టు 16: చారిత్రక ఓరుగల్లు కోటను వీక్షించేందుకు నిత్యం వేలమంది పర్యాటకులు వస్తుంటారు. రాతికోట చుట్టూ నాలుగున్నర కిలో మీటర్ల సీసీరోడ్డు ఉంది. ఈ రోడ్డు మీదుగా వెళ్తూ పర్యాటకులు కోటలోని చారిత్రక కట్టడాలు, ఆలయాల అందాలను వీక్షిస్తారు. అయితే, సీసీరోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో రోడ్డు ఇరుకుగా మారింది. ఈ నెల 8న కోట అభివృద్ధి కోసం ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కలెక్టర్ సత్య శారదతో పాటు అన్ని శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సందర్శించారు. ఆ సమయంలో పర్యాటక శాఖ గైడ్ కోట రోడ్డు దుస్థితిని ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. కోటకు రోజురోజుకూ పర్యాటకుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాన రహదారులతోపాటు రాతికోట చుట్టూ ఉన్న సీసీ రోడ్డును మరమ్మతులు చేసి ముళ్లపొదలను తొలగించాలని పర్యాటకులు కోరుతున్నారు.

మురళీధర్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

మైసమ్మ ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం

కరీమాబాద్, ఆగస్టు 16: వరంగల్ 39వ డివిజన్ కాశీకుంట, విద్యానగర్‌లో చేపట్టనున్న శ్రీకట్ట మైసమ్మ ఆలయ ప్రారంభోత్సవంతోపాటు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు శ్రీకట్ట మైసమ్మ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 19 నుంచి 22 వరకు చేపట్టనున్న కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

HDFC BANK We understand your world
HDFC బ్యాంక్ లిమిటెడ్
ప్రాంతీయ కార్యాలయం: HDFC బ్యాంక్ లిమిటెడ్, డిపార్ట్‌మెంట్ ఫర్ స్పెషల్ ఆపరేషన్స్, బ్యాంక్ హౌస్, ఇం.నెం.6-3-246 మరియు 6-3-244/A, 3వ అంతస్తు, రొక్సానా పల్లాడియం, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500034.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద దిగువ వారికి,
1. **రతన్ టెలిలింక్స్, ప్రాతినిధ్యం వహించు దాని యజమాని: కళ్యాణీనాథ్ మసున భర్త మసున మురళినాథ్**, నెం.2-7-195, సత్రం ఏరియా, ప్రెస్టన్ స్కూల్ సమీపాన, జనగాం, తెలంగాణ-506167.
2. **కళ్యాణీనాథ్ మసున భర్త మసున మురళినాథ్, రతన్ టెలిలింక్స్ యజమాని**, నెం.2-7-195, సత్రం ఏరియా, ప్రెస్టన్ స్కూల్ సమీపాన, జనగాం, తెలంగాణ-506167 మరియు **కళ్యాణీనాథ్ మసున భర్త మసున మురళినాథ్**, ఇం.నెం.2-6-28, కుర్మ వాడ, డీఎస్‌పి ఆఫీస్ సమీపాన, జనగాం, వరంగల్, తెలంగాణ-506167.
3. **మసున మురళినాథ్ తండ్రి మల్లయ్య**, ఇం.నెం.2-6-28, కుర్మ వాడ, డిఎస్‌పి ఆఫీస్ సమీపాన, జనగాం, వరంగల్, తెలంగాణ-506167.
4. **లక్ష్మీ నరసింహ ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహించు దాని యజమాని: కళ్యాణీనాథ్ మసున**, నెం.6-2-2/6-3-1/డి, సూర్యాపేట రోడ్, బాలాజీ నగర్, ప్రెస్టన్ స్కూల్ సమీపాన, జనగాం, తెలంగాణ-506167.
5. **మెదారి సరోజ భర్త రాజనర్సు**, నెం.11-23-2188/ఎ, గణేష్ నగర్, వెంకటేశ్వర గుడి సమీపాన, వరంగల్, తెలంగాణ-506002.

డియర్ సర్/ మేడమ్,
HDFC బ్యాంక్ లిమిటెడ్, సికింద్రాబాద్ శాఖచే మీకు మంజూరు చేసిన ప్రాపర్టీ అకౌంట్ నెం.82299908 తేది: 21.11.2016కి సంబంధించి లోన్ నిమిత్తం భవిష్యత్ వడ్డీతో 26.07.2024 నాటికి బ్యాంక్‌కు **రూ.15,86,956/- (పదిహేను లక్షల ఎనభై ఆరు వేల తొమ్మిది వందల యాభై ఆరు రూపాయలు మాత్రమే)**ల మొత్తం బకాయి ఉన్నది. మేము పలుసార్లు అభ్యర్థనలు చేసినప్పటికీ, మీ ఖాతాలో బకాయి మొత్తం నిమిత్తం మీరు ఎటువంటి మొత్తాన్ని చెల్లించలేదు, అది బ్యాంక్ బకాయిలు తిరిగి చెల్లించుటలో మీరు విఫలమైన కారణంగా RBI మార్గదర్శకాల ప్రకారం NPA ఖాతాగా వర్గీకరించబడినది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్‌లోని నిబంధనలకు అనుగుణంగా **HDFC బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి తన అధికారాలు వినియోగించుకుంటూ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వ్యయాలతో సదరు రుణ మొత్తం **రూ.15,86,956/- (పదిహేను లక్షల ఎనభై ఆరు వేల తొమ్మిది వందల యాభై ఆరు రూపాయలు మాత్రమే)**ను చెల్లించవలసిందిగా మిమ్మల్ని కోరుతూ పైన తెలిపిన చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 31.07.2024 తేదిగల నోటీసును జారీచేసారు. విఫలమైనచో దిగువ షెడ్యూల్ ఆస్తిపై బ్యాంక్ పేరున మీరు కల్పించిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ యొక్క ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో సహా పై చట్టంలో సెక్షన్ 13(4) క్రింద వివరించిన అన్ని లేదా ఏవేని హక్కులను బ్యాంక్ వినియోగించుకుంటుంది.
స్థిరాస్తి షెడ్యూలు: 1) దేశాయిపేట గ్రామం, ఎస్ఆర్ఓ వరంగల్, వరంగల్ టౌన్, వరంగల్ జిల్లా, తెలంగాణ వద్ద గల, సర్వే నెం.262లో 115.38 చ.మీటర్లకు సమానమైన 138 చ.గజాలు విస్తీర్ణపు భూమి, ఇం.నెం.11-23-2188/ఎ కలిగిన ఆర్‌సిసి ఇల్లు యావత్తు యొక్క టైటిల్ డీడ్స్ డిపాజిట్ ద్వారా తనఖా చేయబడినది. **సరిహద్దులు:** తూర్పు: బి.లక్ష్మి ప్లాట్, పడమర: ఎస్.ప్రతాప్ రెడ్డి ప్లాట్, ఉత్తరం: 11 అ.వెడల్పు రోడ్, దక్షిణం: నాజ్మ అఫ్రోజ్ ప్లాట్.
మీరు వాస్తవంగా నివసిస్తున్న/ వ్యాపారం నిర్వహిస్తున్న/ స్వప్రయోజన పనులు నిర్వహించే చిరునామాలో మీకు పంపిన 31.07.2024 తేదీగల నోటీసు ''అందజేయబడకుండా'' వాపసు వచ్చినందున ఈ నోటీసు ప్రచురించుట మాకు తప్పనిసరి అయినది. ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా పైన తెలిపిన బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా పై చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీరు ఇందుమూలంగా కోరబడుచున్నారు. విఫలమైనచో పై చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కులను బ్యాంక్ వినియోగించుకుంటుంది. పై చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులను అమ్మకం, లీజు లేదా ఇతర విధంగా మీరు బదిలీచేయరాదని కూడా మీకు తెలియజేయడమైనది.
ప్రదేశం: సికింద్రాబాద్ సం/- అధీకృత అధికారి
తేది: 31.07.2024 HDFC బ్యాంక్ లిమిటెడ్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

'ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు ఆపాలి'

గీసుగొండ, ఆగస్టు 16: మచ్చాపురంలోని సర్వే నంబర్ 308 ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన కొందరు ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్, గ్రామస్తులు ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ఏడాది ఇండ్ల నిర్మాణాలు చేపట్టిన వారికి జీపీ నుంచి నోటీసులు ఇచ్చామన్నారు. నెలరోజుల నుంచి మళ్లీ నిర్మాణాలు చేస్తుండడంతో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నర్సంపేట రూరల్, ఆగస్టు 16: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన మాదన్నపేటలో జరిగింది. గ్రామానికి చెందిన గొర్రె వినయ్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి విలువైన వస్తువులు, ధాన్యం కాలిపోయింది. ఆర్థికంగా నష్టపోయామని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయాన్ని వినియోగించుకోవాలి

గిర్మాజీపేట, ఆగస్టు 16: విదేశాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఉన్నతవిద్యను అభ్యసించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ద్వారా అర్హులైన ఎస్సీ విద్యార్థులకు అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని వినియోగించుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. అర్హత కలిగిన ఎస్సీ విద్యార్థులు http://telanganaepass. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అక్టోబర్ 13లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ చేసుకున్న దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో అందించాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

గిర్మాజీపేట, ఆగస్టు 16: ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థలో ఉర్దూ మీడియంలో ఖాళీగా ఉన్న ఫిలాసఫీ/సోషియాలజీ, ఉర్దూ లాంగ్వేజ్, సైన్స్ పెడగాజీ, తెలుగు లేదా ఇంగ్లిష్ మీడియంలో సైన్స్ పెడగాజీ పోస్టులకు అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ వాసంతి తెలిపారు. పీజీతోపాటు సంబంధిత సబ్జెక్టులో ఎంఈడీ చేసిన వారు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 21లోగా జిల్లా విద్యా శిక్షణ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

గ్రామ పంచాయతీగా బాలుతండా

ఖానాపురం, ఆగస్టు 16: ధర్మారావుపేట పరిధిలోని బాలుతండా గ్రామ పంచాయతీగా ఏర్పాటు కానుంది. అన్ని విధాలా అర్హత ఉన్నా అధికారుల తప్పిదంతో బాలుతండా జీపీగా ఏర్పాటు కాలేదు. నర్సంపేట ఎమ్మెల్యేగా పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలిచిన అనంతరం బాలుతండాపై ప్రత్యేక దృష్టి సారించారు. 2022లోనే ప్రభుత్వానికి ఆయన నివేదిక అందజేశారు. గెజిట్ విడుదల కావాల్సిన సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 200పైగా జీపీలను ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. ఆ జాబితాలో బాలుతండా పేరు ఉండడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో బాలుతండా 21వ జీపీగా ఏర్పాటు కాబోతున్నది. నేడో రేపో జాబితా విడుదల కానుంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పర్వతగిరి, ఆగస్టు 16: మండలకేంద్రంలో శనివారం వీధిదీపాలకు మరమ్మతులు చేయాల్సి ఉన్నందున ఉదయం 7 గంటల నుంచి విద్యుత్ సరఫరా ఉండదని జీపీ కార్యదర్శి ఎస్ రఘు తెలిపారు. గ్రామస్తులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాపన్న జయంతిని జయప్రదం చేయాలి

గిర్మాజీపేట, ఆగస్టు 16: కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహిస్తున్న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతిని జయప్రదం చేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పుష్పలత ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై పాపన్నకు నివాళులర్పించాలని కోరారు.

వైద్య సేవల బంద్‌కు టీవోఎస్ మద్దతు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 16: ఐఎంఏ పిలుపు మేరకు వైద్య సేవల బంద్‌కు తెలంగాణ ఆప్తమాలజిస్ట్ సొసైటీ (టీవోఎస్) మద్దతు తెలియజేసింది. దేశవ్యాప్త బంద్‌కు ఆప్తమాలజిస్ట్ సొసైటీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ భరత్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వైద్యుల రక్షణకు కొత్తం చట్టం రూపొందించి, అమలు చేయాలని కోరారు.

తెలంగాణ సాంస్కృతిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుమన్

దుగ్గొండి, ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నెల్లుట్ల సుమన్ ఎంపికయ్యారు. తొగర్రాయి గ్రామానికి చెందిన సుమన్ తెలంగాణ ఉద్యమంలో కళాకారుడిగా ప్రజలను చైతన్యపరిచారు. శుక్రవారం ఖిలావరంగల్‌లో టీఎస్ఎస్ జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి సభ్యుడికి ధన్యవాదాలు తెలిపారు.

20న నిరుద్యోగ జాబ్ మేళా

పోచమ్మమైదాన్, ఆగస్టు 16: రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో 50 లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ ఆఫీసర్ ఉమారాణి తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, 30 నుంచి 45 ఏళ్లలోపు ఉన్న వారికి నెలకు రూ. 15,000 నుంచి రూ. 25,000 వరకు వేతనం చెల్లిస్తారని, వివరాలకు 9573885532లో సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాశీబుగ్గ, ఆగస్టు 16: డివిజన్ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ సూచించారు. కాశీబుగ్గలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కళాజాత ద్వారా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కుసుమ సతీశ్‌బాబు, తోట బాలరాజు, ఎండీ మక్బూల్, బిట్టు, కురాకుల చంద్రశేఖర్, సీహెచ్ గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

చెన్నారావుపేట, ఆగస్టు 16: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కుందేలు రాజేశ్(30) గురువారం తల్లితో గొడవపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే, లింగగిరి గ్రామానికి చెందిన మంద మల్లయ్య(55) ఆటోలో వెళ్తూ జారి పడి గాయపడ్డాడు. ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

ఇద్దరి అదృశ్యం

మట్టెవాడ/ఖిలావరంగల్, ఆగస్టు 16: వరంగల్ డీఎంహెచ్‌వో సమీపంలోని సత్యసాయి అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న కందగట్ల సునేత్ర(26) అదృశ్యమైనట్లు మట్టెవాడ సీఐ టి.గోపి తెలిపారు. యువతి తండ్రి సురేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన కంచి దేవరాజు శుక్రవారం తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదని మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. అతడి భార్య కంచి పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

మరిన్ని జిల్లా వార్తలు 8వ పేజీలో..